విస్థాపన, వలస, పునరావాసం... మనిషి మూలాల్ని తెగ్గొట్టేదానికి ఏ పేరైనా పెట్టొచ్చు.
పరాయి ప్రపంచంలోకి విసిరివేయబడ్డ మనిషి- తను ఏ నేపథ్యం నుంచి వచ్చినవాడైనా-
పలు అవసరాల లేమి బాధిస్తున్నప్పుడు, అనేక భయాలు వెంటాడుతున్నప్పుడు,
వయసు మీరినతనపు అభద్రతాభావన మనస్సును తొలుస్తున్నప్పుడు...
కొత్త మజిలీలో నిలదొక్కుకునేందుకు పడే ఆరాటానికి, అస్తిత్వాన్ని,
వ్యక్తిత్వాన్ని కాపాడుకునే ప్రయత్నానికి అక్షరరూపం.

ఆడెపు లక్ష్మీపతి

# 12 అభావం అంచుమీద





మెట్లు దిగి వడివడిగా అడుగులు వేసి పోర్టికో నీడలోంచి బయట పడగానే ఎండతడ చుర్రుమంటూ లోకనాథం ముఖాన్ని తాకింది. రెండు క్షణాలు కళ్లు మిటకరించి రిస్టువాచీలో టైం చూసుకున్నాడు. మధ్యాహ్నం ఒంటిగంట దాటిపోయింది.

‘‘రాస్కెల్స్... ఇక్కడ ప్రతి వొక్కడిదీ నిర్లక్ష్యమే. కడుపులో చల్ల కదలని ఉద్యోగాలు. నెల తిరిగేసరికల్లా ఠంచనుగా చేతిలోపడే జీతాలు. ఇక ఎదుటివాడి బాధ ఎలా అర్థమవుతుందీ ఇడియట్స్‌కి?’’ పైకి వినపడేలా తిడుతూ కోపం వెలిగక్కేందుకు తపుక్కున ఉమ్మేశాడు. కానీ తడి ఎండుకుపోయిన నోట్లో నాలుక కదలలేదు. మెల్లగా రెండు గుక్కలు నీళ్లు తాగి బాటిల్‌ని తిరిగి పాలిథీన్ క్యారీబ్యాగులో పెట్టుకున్నాడు.

ఏదో సలహా ఇస్తూన్నట్టుగా, అనునయిస్తూన్నట్టుగా మాట్లాడుతూ అతని పక్కనే నడుస్తూన్న సెక్యూరిటీ గార్డు, ‘‘... అయినా దేనికైనా ఒక పద్ధతి వుంటుంది, ఒక రివాజు వుంటుంది. ఊరికెనే అంత లొల్లి జేస్తే ఎట్లా భాయ్? ఆఫీసంతా అదిరేలా అరిస్తివి, అలసిపోతివి. ఏదైనా చెట్టుకింద జరంతసేపు నిలుసో. కొబ్బరిబోండాం తాగి కూల్‌డౌన్ అయేందుకు ప్రయత్నించు...’’

ముఖం చిట్లించాడు లోకనాథం. ‘‘ఊరికేనే అరిచానా? ఏం తెలుసునని మాట్లాడతానవ్? అరిస్తేగానీ... పనులవవని ఇవ్వాళ తెలిసింది నాకు. సోనార్ కీ సౌ, లోహార్ కీ ఏక్. నువ్వు గూడా చూసినవ్ కదా! ఇప్పుడు ఫైలెక్కడాగిందో చూడవయ్యా అంటే ముందు ముందు సిస్టమ్ మారుతుందనీ, ఇంకేదో అవుతదనీ కబుర్లు చెప్పుతడేంది...’’

తన ధోరణిలో తాను చెప్పుకుంటూ పోయాడు సెక్యూరిటిగార్డు. ‘‘సరే. ఏదో టెక్నికల్ ప్రాబ్లం మూలంగా అలా జరిగుంటుంది.. కమీషనర్ సాబ్ నీ కేసు స్వయంగా పరిశీలిస్తనన్నాడు కదా. ఇక శాంతంగా ఇంటికి వెళ్లు. పెద్దోడివి. ఈ వయసులో ఓపిక కోల్పోయి కేకలెయ్యొద్దు. ఉత్తగ బీపీ పెంచుకోవద్దు...’’

అతనన్న ఆఖరు మాటకు ఎక్కడో చురుక్కున కాలింది లోకనాథానికి. చల్లారిన కుంపటి అడుగున మళ్లా రగుల్కొన్న నిప్పుకణికెలా కోపం కణకణమన్నది. జబ్బ మీద సెక్యూరిటీ గార్డు చేతి స్పర్శ చీదరగా తోచింది. ఒక్క విసురుతో ఆ చేయి విదిలించుకుని రెండంగలు దూరం జరిగాడు. తల వెనక్కి తిప్పి ఆ బహుళంతస్తుల ప్రభుత్వ భవనాన్ని, పొడుగాటి ఆఫీసు బోర్డునీ, సెక్యూరిటీ గార్డునీ ద్వేషం నిండిన కళ్లతో తీక్షణంగా చూశాడు.

"కస్టమర్ కేర్ సర్వీస్ కౌంటర్‌లో ఫిర్యాదు రాసిచ్చిన. 'ఈపీఎస్-నైన్‌టీఫైవ్' ఆర్డరు, బ్యాంకు అక్కవుంటు కాపీలతో రెండుసార్లు సెక్షనాఫీసర్ని కలిసినా. ఎవడూ పట్టించుకోడే..? ఏమన్నా వాళ్ల జేబుల్లోంచి ఇస్తున్నారా ఈ బాస్టర్డ్స్! మూడు నెలలు వరుసగా పెన్షన్ రాకుండా వుంటే ఆ గోస ఎట్లవుంటదో ఏ బాడ్కావుకైనా అనుభవ మయితేనే అర్థమయితది. గడ్డ మీదున్నోడు ఎన్ని సలహాలయినా ఫిరీగానే ఇస్తడు..."

ఇంకేమి మాట్లాడాలో సెక్యూరిటీగార్డుకు తోచలేదు. రెండు క్షణాలపాటు లోకనాథాన్ని ఎగాదిగా చూశాడు. "ఇక పోయిరా. బాధపడకు. బెస్టాఫ్ లక్," అనేసి వెనుదిరిగాడు.

గోధుమరంగు కాడ్రాయ్ ప్యాంటు నడుంమీదికి లాగి టక్ సవరించుకున్నాడు లోకనాథం. లేతనీలం రంగు పొడుగు చేతుల లినిన్ చొక్కా మీది ముడుతలు సాపు చేసుకుని కాలర్ సరిచేసుకున్నాడు. 'ఆఫీసు ముంగట కాపలా కాసేటోడు గూడా జాలిచూపిస్తున్నడు, సలహాలిస్తున్నడు. ఛట్. వీని బోడిస్టైల్, బట్లరింగ్లీషు పాడుగాను...' అని మనసులో తిట్టుకుంటూ మెట్లెక్కి పోతున్న సెక్యూరిటీగార్డు వేపు ఈసడింపుగా చూశాడు. కడక్ యునిఫారం లోపల నిటారైన దేహం, బలమైన కాళ్లేతులు, హెయిర్ డై వేసు కున్నందువల్ల నల్లగా నిగనిగలాడుతున్న జుట్టు..రొమ్ము విరిచి నడుస్తూ మెట్లు ఎక్కుతూన్న సెక్యూరిటీగార్డుది బయటికి కనపడుతున్నంత ధృఢమైన శరీరం కాదేమో ననిపించింది లోకనాథానికి. దాచినా దాగని కళ్లకింది ముడుతలు, కంఠంపై జారిన చర్మం అతని వయసు తనలాగే కచ్చితంగా లేట్ ఫిఫ్టీస్ అయివుంటుందనీ, అతనిది కావాలని అతిగా ప్రదర్శించే మిలిటరీ స్టైల్ అనే నిశ్చయానికొచ్చాడు.

మెయిన్‌గేట్‌లోకి ప్రవేశిస్తూ వేగంగా మలుపు తిరిగిన తెల్లని పెద్ద కారు.. హారన్ మోత విని పేవ్‌మెంట్ అంచునుండి ఒక్క అంగలో పక్కకు తొలిగాడు లోక నాథం. నిప్పులు చెరుగుతోంది మధ్యాహ్నపుటెండ. కారు డోరు అద్దాల్లో కొన్ని క్షణాల పాటు కనపడ్డ తన నీడ. కళ్లు విప్పార్చి చూశాడు లోకనాథం. చెవులు, మెడపైకి పెరిగి పోయిన జుట్టు కణతల దగ్గర పలచబడి చాలాభాగం నెరసినట్టుగా కనబడుతోంది. సగంకన్నా ఎక్కువగా తెల్లబడ్డ మీసాలు, మాసిన గడ్డం, వడలిపోయిన ముఖం. పాత

మోడల్ కళ్లద్దాల వెనకాల లోతుల్లోకి పోయిన కళ్లు... ఇంకా అరవయ్యోపడిలో పడలేదు తను- పొద్దున తన రూపం ఇంత అధ్వాన్నంగా కనిపించలేదే? ముఖంమీది దుమ్ము, జిడ్డు కర్చీఫ్‌తో తుడుచుకుంటూ ఆలోచనల్లో పడ్డాడు లోకనాథం.

❖

ఉదయం వేళ. ఏడున్నర కావస్తోంది. టీషర్టు లోపల చెమటచిత్తడితో తడిసిన వొళ్లు ఎండతీక్షణతకు చిరచిర లాడుతూంటే చంకల వద్ద వదులయ్యేలా షర్టుబటన్లు రెండు తీసేశాడు లోకనాథం. గబగబా నడిచి వీధి మలుపు తిరిగి హెయిర్ కటింగ్ సెలూన్‌లో ప్రవేశించాడు. సుమారు పావుగంట క్రితమే తెరిచిన సెలూన్‌లో వేగంగా తిరుగుతున్న సీలింగ్ ఫ్యాన్ గాలికి దేవుళ్ల పటాల వద్ద వెలిగించిన అగరొత్తుల నుండి, ఇతర క్రీముల నుండి చవకబారు పరిమళం కలయ తిరుగుతోంది. ప్రవేశద్వారం సమీపానే వున్న పెద్ద అద్దంలో తన ప్రతిబింబం చూసుకున్నాడు. మూణ్నెళ్ల క్రితం చేయించుకున్న క్షవరం, బద్ధకించి వదిలేసిన వారం రోజుల గడ్డం... ఇవాళ ఈ చీకాకు వదిలించుకోవాలి.

సెలూన్‌లోని పొడువాటి బెంచీ చివరన సందు చేసుకుని కూర్చున్నాడు లోకనాథం. "కటింగ్, షేవింగ్ చేయాలి. ఎంత టయిం పట్టుద్ది?"

"ఇంకో గంటన్నా ఆగాలె సార్!" చెప్పాడు మంగలి.

తలూపి పక్కకు చూశాడు లోకనాథం. తనకన్నా ముందు వచ్చిన ఇద్దరు వ్యక్తులు తన పక్కన. వాళ్ల తర్వాతే తన వంతు అన్నమాట. ఎదురుగా వున్న పాత ప్లాస్టిక్ స్టూలుపై రెండు దినపత్రికలు, బాగా నలిగిన నాలుగు సినిమా మ్యాగజైన్లు. సెలూన్‌లో ఓ మూలన బాగా మాసిన ముతక తెరల మాటున అపరిశుభ్రంగా కనపడుతున్న చిన్న సింక్. ఎంట్రన్స్ పక్కనే అటు మూలన పెద్దగా చప్పుడు చేస్తూ నడుస్తూన్న ఒక పాత ఎయిర్‌కూలర్. దాని కర్ణకఠోర ధ్వనిని అధిగమించి వినిపించేలా పూర్తి వాల్యూంతో మోగుతూన్న కలర్ టీవీ. ఏదో చానెల్‌లో ఒకకొత్త సినిమాలోని ఐటం సాంగ్ ప్రసారమవుతూ చూపరులకు కనువిందుచేస్తోంది.

సెలూన్‌లోని మూడు బార్బర్‌కుర్చీల్లో ఒకదాంట్లో ఒక కస్టమర్ కూర్చు న్నాడు. సుమారు నలభై ఏళ్ల వయసున్న మంగలి తన ముక్కు మీదకు జారుతూన్న హాఫ్‌ఫ్రేం చిన్న కళ్లద్దాలను తడవకొకసారి సవరించుకుంటూ దువ్వెన-కత్తెరలను చకచకా కదిలిస్తూ అలుపు సొలుపు లేకుండా రకరకాల విషయాలపై అదే పనిగా మాట్లాడుతున్నాడు. రాజకీయాలు, నిత్యావసర వస్తువుల ధరలు, సినిమాలు, ఆ కాలనీవాసులైన కొందరి గుణగణాలు- వగైరా... సమస్త అంశాలపై తన వ్యాఖ్యానం వినిపిస్తూన్నాడు. ఒక కన్ను టీవీ స్క్రీన్‌పైన, మరో కన్ను క్షవరం చేస్తున్న తలపైన వుంచి- అటు దిద్దీ, ఇటు దిద్దీ ఎట్టకేలకు కస్టమర్‌కి హెయిర్ కటింగ్ ముగించాడు.

''కటింగ్ ఓకేనా సార్?'' వెంట్రుకలు దులుపుతూ అడిగాడు మంగలి.

''బాగుంది. ఇక షేవింగ్ జల్దిగ కానిచ్చి...'' అన్నాడు కస్టమర్.

కస్టమర్ చెంపలకు బ్రష్‌తో గబగబా క్రీము రుద్ది ఒక నిమిషం తర్వాత నిదానంగా రేజర్ కదిలించనారంభించాడు మంగలి. మళ్లా బాతాఖానీ షురూ చేశాడు.

''మీ కొడుకు, కోడలు అమెరికాలో మంచిగున్నారా సార్. ట్రంప్ వచ్చినంక అక్కడి పరిస్థితులు మారినయంటున్నారు...''

''మా పిలగాడున్నచోట ఏం భయంలేదు. పోయిన్నెల వచ్చిపోయింర్రు కద. యేములాడలో మా మనుమనికి పుట్టెంట్రుకలు తీసినం.''

''మీ కొడుకు చాలా వుష్షార్ సార్. ఏదేమైనా మీరు అంతా ప్లాను ప్రకారమే చేస్తరు... ఔనూ..మీ యింటి వెనుక లేనులో ఆ మూడంతస్తుల పింక్ బిల్డింగ్ డాబా పైన టెంటు, లైట్లు, రాత్రి పదకొండుదాకా మాటలు ముచ్చట్లు... ఏంది సార్ సంగతి...?''

''ఆ యింటాయన బిడ్డ పెండ్లిజేసిండు. నిన్న మస్తుగ దావత్ ఇచ్చిండు. దగ్గరి చుట్టాలను, స్నేహితులను, కాలనీ ముఖ్యులను పిలిచిండు.''

''అట్లుండాలె సార్ దిల్. పైసలున్నా ఖర్చుపెట్టే దిల్ ఎందరికుంటది? పోయిన వారం చౌరాస్తామీది బార్ వోనరు బిడ్డ పెండ్లి చేసిండు. నా చేతనే పోలు పోయించిండు. కానీ ఏం మనిషి సార్- నాకు పోలు కట్నమిచ్చేందుకు ఎన్నో లెక్కలేసుకుని నన్ను నాలుగుమాట్లు తప్పించుకున్నడు.''

''ఆయనిప్పుడు అధికారపార్టీలో మంచి పలుకుబడి సంపాయించిండు. వచ్చే ఎన్నికల్లో కార్పొరేటర్ పోస్టుకు ఆయనే నిలబడతడట...''

''బాగా డబ్బున్నోడే రాజకీయాలల్లకు దిగుతున్నాడు. ఇంకింత సంపాయించు కుంటున్నడు. ఇసొంటోళ్లు మన నాయకులైతే దేశమేం బాగుపడుతది సార్. ఈ డివిజన్ కార్పోరేటర్ మేడం పెనిమిటి పార్టీ మారిండట. ఎమ్మెల్యే సీటుకు గురిపెట్టిండంట కదా... పేపర్ల చూసిన. ఎవని ఆరాటం వానిది. సరే- నిన్న ఆవలిగల్లీ బ్యాంకు పక్క సందుల ఏదో మీటింగయినట్టు జనం మూగింర్రు. పోలీసు జీపులు కనపడ్డయ్- ఏంటిది సార్ అది...?''

''ఆ కొత్త వెంచర్ నువు చెబుతున్న కార్పొరేటర్ బినామీదే. ప్లాట్లల్లకు నీళ్ల పైపుల కనెక్షన్‌కు ప్రారంభోత్సవ పూజ జరిగింది...''

అలా బాతాఖానీ సాగుతూనే వుంది. సెలూన్‌లోని కస్టమర్లు టైము సోయి మరిచిపోయేలా చేసే కమనీయ దృశ్యాలు, డ్యాన్సులు, పాటలు వరుసగా బుల్లితెరపై మోగుతూనే వున్నాయి.

టీవీ చానెల్‌లో ఆ క్షణాన వస్తున్న డ్యాన్సు ప్రోగ్రాం కళ్లు తిప్పుకోలేనంత రంజుగా వుంది. తన పొందికైన అవయవ సంపదని చక్కగా ఎక్స్‌పోజ్ చేస్తూ బహు సెక్సీగా చిందులేస్తోంది ఐటంసాంగ్‌లోని నటి. ఛాతీ వెనక్కి విరిచి బరువైన చను దోయిని లయబద్ధంగా వూపి, కిందికి మీదికి కదిలిస్తూ, పొత్తి కడుపుని వెనక్కి, ముందుకు ఉధృతంగా ఊపుతూ. భారమైన నితంబాల్ని ఫ్రేము నిండుగా ఊగిస్తూ... మూతిని మురిపెంగా ముడిచి మగవాళ్ల వైపు ముద్దులు విసురుతోంది. సెలూన్‌లోని వ్యక్తులు టీవీ స్క్రీన్ వైపే గుడ్లప్పగించి చూస్తూ ఆ పసందైన దృశ్యాలను తనివితీరా ఆస్వాదించసాగారు. డ్యాన్సు చివర ఒక హాస్యనటుడి ముతక శృంగారపు చేష్టకు, నటి వెక్కిరింత మాటకు అందరికీ పొట్టచెక్కలయ్యేంత నవ్వు వచ్చింది. ఆపుకోలేక పోయిన మంగలి తను చేస్తున్నపని మరిచిపోయి పకపకా నవ్వాడు.

షేవింగు చేయించుకుంటున్న కస్టమర్ భయంగా తలతిప్పి చూశాడు. మరుక్షణమే కోపం తెచ్చుకున్నాడు. "ఓయ్, జాగర్త. ధ్యాస ఇటు పెట్టు. ఏదో లోకంలో వుండి నా చెవో, ముక్కో కోసేసేవు సుమా..."

నవ్వాపి, అటెన్షన్‌లోకొచ్చాడు మంగలి. బుద్ధిమంతుడిలా రెండు నిమిషాల పాటు పూర్తి మౌనం వహించి పరమ వినయంగా షేవింగు పూర్తిచేశాడు. కస్టమర్ ముఖంపై నీళ్లు కొట్టి తుడిచి, తువ్వాలు దులుపుతూ వాక్ప్రవాహం తిరిగి కొనసాగిం చాడు. మూడు రకాల హెయిర్ డైలను చూపించి అచ్చు మార్కెటింగ్ ఏజంటులా వాటి ప్రత్యేకతలను వివరించాడు. పాతకాలపు హెన్నాలకు వాటికీ మధ్య తేడాలేమిటో ధరలతో సహా తెలియచెప్పాడు. కొత్తగా ప్రకటనల్లో వస్తోన్న ఒక ప్రముఖ బ్రాండు డైని సూచించి తన జుట్టుకు అదే వేయాల్సిందిగా మంగలిని ఆజ్ఞాపించాడు కస్టమర్. తాపీగా గిన్నెలో డై కలుపుతూ, "మీరు హెయిర్ డై రెగ్యులర్‌గా వేసుకోవాలె సార్.మీ వయసు తెలువదింక. ఈ రంగేసుకున్నంక మీరు అచ్చం అగో- ఆ సిన్మా హీరో లెక్కుం టరు..." అంటూ మంగలి టీవీలో దృశ్యాన్ని వేలెత్తి చూపించాడు.

టీవీ వైపు తలతిప్పి చూశాడు కస్టమర్. ఒక యువహీరో నటించిన కొత్త సినిమా లోని రొమాంటిక్ సన్నివేశం చూసి ముసిముసిగా నవ్వాడు.

బెంచీ మీద వెయిటింగులో ఉన్నవాళ్లలో ఒకతను, ఆమూలాగ్రం చదివేసిన దినపత్రికను మడిచి స్టూల్ పైకి విసిరాడు. లేచి నిలబడి సహనం నశించిన వాలకం పెడుతూ మంగలి వైపు చూశాడు. ముఖమంతా విచ్చుకునేలా నవ్వాడు మంగలి. "అయిపోయింది సార్. ఇంకో పది నిమిషాలు.."

లేచి నిలబడ్డ వ్యక్తి అసహనంగా ఏదో గొణిగి మళ్లా కూర్చున్నాడు.

టైం చూసుకున్నాడు లోకనాథం. ఎనిమిదిన్నర దాటిపోయింది.

''ఇంకా ఎంత టయింపడుతుంది నా వంతుకు?''

''మీకన్నా ముందర వాళ్లిద్దరున్నరు కద సార్. కనీసం ఇంకో గంట!''

''నేను ముందే అడిగినప్పుడు ఒక గంట అన్నావు. ఆ గంటా అయిపోయింది. మళ్లా ఇంకో గంట నేనిక్కడ్నే కూర్చోవాల్నా?''

మందహాసం చేస్తూ తలూపాడు మంగలి. ''ఈ సారుది కటింగ్, షేవింగ్ మాత్రమే అనుకున్నా... చూస్తున్నారు కదా- హెయిర్ డై కూడా వుంది. పది నిమిషాలు. అదయ్యాక ఆ సారుకు కటింగ్, ఇటున్న సారుకు షేవింగు తర్వాత మీకు.''

చిర్రెత్తుకొచ్చింది లోకనాథానికి. ''నీ పద్ధతి చూస్తూంటే నా వంతు ఇంకో రెండు గంటలైనా రాదు. ఇంతమంది కస్టమర్లు వెయిటింగులో వున్నప్పుడు జరంత సీరియస్‌గా, స్పీడుగా పనికానియ్యలేవా? ఆ టీవీ ముందుగా ఆఫ్ చెయ్యి. ముచ్చట్లు బందు పెట్టు. బార్బర్ కుర్చీలు మూడు, మంగలేమో ఒక్కడు. ఏం సెలూనయ్యా యిది...''

''చేతికిందికి పనోళ్లు దొరుకుతలేరు సార్. మస్తుగ జీతమడుగుతాండ్రు, రోజూ టిఫిన్లు, ఛాయ్‌లు కావాలంటున్నరు. ఏడికో ఓకాడికి కుదుర్చుకున్నా కానీ ఎక్కువ రోజులుంటలేరు. చెప్పాపెట్టకుండా పని మానేస్తున్నరు. ఇవాళ మా బామ్మర్ది వరుసోడు ఒకడు వచ్చేదున్నది. మంచి పనిమంతుడు. వాడొస్తే మిమ్ముల వెంటనే కూర్చోబెడత. ఒక్క గంటలో మీ కటింగ్, షేవింగ్ కానిచ్చేస్తడు...'' రకరకాల హావభావాలు కనపరుస్తూ అన్నాడు మంగలి.

''చాల్చాలు. ఒక గంట అంటే నీ భాషలో రెండు గంటల పైన అని తెలుస్తూనే వుంది. మాటలు బాగా మాట్లాడతవు. అర్ధగంట అటూ ఇటూ అయితే ఫర్వాలేదుకానీ గంటల తరబడి మమ్మల్ని ఇలా కూర్చోబెడతావా? ఎంత టైము వేస్టు! మాకేమీ పనుల్లేవనుకుంటున్నావా?''

చేస్తున్న పనాపి లోకనాథాన్ని తేరిపారజూశాడు మంగలి. ''పనుంటే చూసుకుని మధ్యాహ్నమో, సాయంకాలమో రాండ్రి. నిదానంగ...''

''ఇంతసేపు కూర్చోబెట్టి వెళ్లి మధ్యాహ్నం రమ్మంటవా? ఏందా తలతిక్క మాటలు? ఈ బస్తీలో ఇదొక్కటే సెలూన్ కాలవడ్డదనా ఇంత టెక్కు నీకు?'' అన్నాడు లోకనాథం కోపంగా.

''అరరే. అంత గరం ఎందుకవుతున్నారు? జరంత మంచిగ మాట్లాడలేరా?''

''మంచా? నీ వ్యవహారమే మంచిగ లేదు. సెలూన్‌లో నన్ను రెండు గంటలు వేస్టుగా కూర్చోబెట్టినవ్. అది చాలక ఫలానా సమయమప్పుడు రమ్మని ఉచిత సలహాలిస్తవా? ఏం తమాషాగా వుందా..''

''నా ఉద్దేశం అది కాదు సార్. ఫ్రీ టైంలోనైతే మీ కటింగ్, షేవింగ్, డైయింగ్ కూడా నీటుగా చేయవచ్చునని అట్లా అన్నా. వయసుకు తగ్గ ఓపిక లేదేంది మీకు. సిటీకి కొత్తా?''

''షటప్. నీ సెలూన్‌లో అడుగుపెట్టడం నాదే బుద్ధితక్కువ...'' అంటూ బయటికి నడిచాడు లోకనాథం. అతనివైపే అరనిమిషం పాటు విస్తుపోయి చూశాడు మంగలి. వినీ వినబడని మోటు మాట ఏదో అన్నాడు.

❖

పేవ్‌మెంట్‌పై పెద్ద పెద్ద అంగలు వేస్తూ బస్‌స్టాప్ వేపు నడిచాడు లోకనాథం. దాహంతో నాలుక పిడుచకట్టుకు పోయింది. బాటిల్లోంచి మళ్లా రెండు గుక్కలు నీళ్లు తాగాడు. ఇక చాలు. బాటిల్ అడుగున కొన్ని మాత్రమే నీళ్లు మిగిలున్నాయి. తను ఇల్లు చేరేసరికి ఎంత టయమవుతుందో? కడుపులో చిన్నగా ఆకలి మొదలయింది. రెండు బిల్డింగులు దాటాక రోడ్డు మలుపు వద్ద గానుగచెట్టు అరకొర నీడలో ఒక ఫుట్‌పాత్ జ్యూస్‌స్టాల్. మిక్సర్ గిరగిరా తిరిగాక జ్యూస్‌లోంచి రసాన్ని గ్లాసులో వడగట్టుతోన్నాడు జ్యూస్‌వాలా. సమయం మధ్యాహ్నం ఒకటిన్నర దాటింది. మరుగుతున్న ఆరెంజ్ జ్యూస్ ఆకాశం నుండి ధారాళంగా కురుస్తున్నట్టుగా తీక్షణంగా వుంది ఎండ. చౌరస్తా అవతల ప్రభుత్వాసుపత్రి బస్టాపు వద్ద రెండు రూట్ల నుండి వచ్చే బస్సులు దొరికే అవకాశముంది. దాదాపు మూడు ఫర్లాంగుల దూరం ఉండొచ్చు. తప్పదు, నడవాలి. అడుగుల వేగం పెంచాడు లోకనాథం.

ఆస్పత్రి బస్టాపు వద్ద ఎక్కువ జనం లేరు. పేరుకే బస్‌షెల్టర్ కానీ అక్కడ నీడే లేదు. వంగి విరిగిపోయి, పెయింటు వూడిపోయిన నల్లని పాత ఇనుపకుర్చీలు ముట్టుకుంటే కాలుతున్నాయి. వాటిపై కూర్చునేటట్టు లేదు. సమీపంలో నాలాపై వంతెన. ఉచ్చల కంపుకొట్టే దాని గోడకు ఆనుకుని మట్టిపని చేసే కూలీల తాత్కాలిక నివాసాలు. పై కొమ్మలు వాడిపోతున్న పెద్ద వేపచెట్టు నీడన కొంచెం శుభ్రంగా వున్న చోట భోజనాలకు కూర్చున్నారు కూలీలు. అందేంత ఎత్తులో వున్న ఒక కొమ్మకు పెద్ద చిక్కం వేలాడుతోంది. అందులోంచి, అన్నం, కూరలు వున్న పెద్ద పెద్ద గిన్నెలను నిక్కర్ తొడుక్కునున్న ఒక పదిహేనేళ్ల కుర్రాడు ఒక్కొక్కటిగాతీస్తూ తండ్రికి అందిస్తున్నాడు. బొంతలు పరిచిన చెట్టు మొదలు దగ్గర నిలబడి ఒక మహిళాకూలీ- కుర్రవాడి తల్లి- రోడ్డు మీదుగా దృష్టి సారించి రెండు ఫర్లాంగుల దూరాన అవతలి వీధిలో ఆగి వున్న వాటర్‌టాంకర్ వైపు ఆందోళనగా చూస్తోంది. చెట్టు అవతలివైపున అయిదుగురు సభ్యులున్న మరో కుటుంబం సద్దిమూటలు విప్పి భోజనాలు తినడానికుపక్రమించారు. బాగా కిందికి వాలిన ఒక బలిష్టమైన కొమ్మకు వేలాడుతూన్న చీరమడతల వుయ్యాలలో రెండేళ్ల పాప హాయిగా నిదరపోతోంది. వుయ్యాల తాడుకు వైరుతో కట్టిన సెల్‌ఫోన్‌లో ఎఫ్ఎం రేడియోలో పాత తెలుగు సిన్మా పాటలు చక్కగా వినవస్తున్నాయి.

పైకి తేలిన వేర్లు, వంకర్లు తిరిగిన కణుపులతో, దాదాపు రెండున్నర మీటర్లు మెయిన్ రోడ్డు వైపుకు విస్తరించుకుపోయిన వేపచెట్టుమొదలు సరీసృపం పాదంలా వుంది. అక్కడ నిలబడి, రావాల్సిన వ్యక్తి కోసం ఎదురు చూస్తోన్న మహిళా కూలీ తన దృష్టి మరింత దూరం, స్పష్టంగా ఆనేందుకు త్రెంచి తవ్విన మట్టి దిబ్బ పైకి ఎక్కింది. జామూన్‌రంగు నేత చీర కట్టుకున్న ఆమెకు నలభై ఏళ్లుంటాయేమో. తగినంత కండపుష్టిలేని వొళ్లు, ఎండుకుపోయిన ఛాతీ. అలా చూస్తూనే ఆమె తన చీర చెంగులు సవరించుకుంది. ఒకసారి కురులు గట్టిగా దులుపుకుని వేళ్లతోనే చిక్కులు దువ్వుకుని సిగ ముడుచుకుంది.ఆమె ధరించిన ఎర్రజాకెట్టు వీపు మీదా, మెడచుట్టూ ఉప్పు పేరుకుపోయిన తెల్లచారికలు. అప్పటికే చెంబెడు నీళ్లతో ఆదరాబాదరాగా కడుక్కొన్న ముఖాన్ని భుజమ్మీది పాతతువాలుతో తుడుచుకుంది. మట్టిపని చేసేటప్పుడు సౌకర్యం కోసం గోచీ బిగించిన చీరపై ఆచ్ఛాదనగా చుట్టిన తువ్వాలు అది.

''మంచినీళ్ల కోసం పోయిన పిల్ల ఇంకా రాకపాయె...'' ఆదుర్దా నిండిన స్వరంతో అందామె.

అన్నం, కూరల గిన్నెల చుట్టూ కంచాలు పెడుతున్న కొడుకు, బొంత మడతలు సాపు చేస్తూన్న పెనిమిటి- ఆమె ఆందోళనలో పాలుపంచుకుంటూ తలెత్తి చూశారు. రెండు నిమిషాలు పోయాక సంతృప్తిగా నిట్టూర్చింది మహిళ. మెయిన్ రోడ్డు అవతల బస్తీలో వాటర్‌టాంకర్ దగ్గర తోపులాటలో, అరుపులు కేకల రణగొణ ధ్వనుల్లో ఎలాగో నెగ్గుకుని వాళ్ల కూతురు మంచినీళ్లు తీసుకువస్తోంది. నెత్తిమీద ఆకుపచ్చరంగు ప్లాస్టిక్ బిందె, ఒక చేతిలో నిండు బకెట్ మోస్తూ ట్రాఫిక్ తప్పించుకుంటూ జాగ్రత్తగా రోడ్డు దాటి వచ్చేసిందా అమ్మాయి. ఎర్రపూల లంగా, పసుపచ్చ వోణీ, తెల్ల జాకెట్టు ధరించిన ఆ పద్ధెనిమిది లేక ఇరవై ఏళ్ల వయసున్న పల్లెటూరి పిల్లలో అద్భుతమైన ఆకర్షణ వుంది.

వంగి, ప్లాస్టిక్ బిందె కింద పెట్టి, నిటారుగా నిలబడి వోణీ అంచుతో ముఖం, మెడల మీద చెమట తుడుచుకుంటున్న ఆ పిల్ల వైపు పరీక్షగా చూశాడు లోకనాథం. ఎత్తుకు తగ్గ లావు, చూడచక్కని అవయవ పొందికతో, ఆకట్టుకునే శరీర సౌష్ఠవం ఆమెది. వొంటిరంగు తెలుపే అయినా రోజుల తరబడి ఎండస్పర్శకు గురవడంవల్ల కందిపోయినట్టయి పోతపోసిన రాగి ప్రతిమను తలపింపజేస్తోంది. ఆమెలోని అందం లేదా ఆకర్షణ- నిజంగా ఎక్కడున్నాయో పరిశీలించాడు లోకనాథం. విశాలమైన తెల్లని కళ్లు, నిండైన బుగ్గలు, తీర్చిదిద్దినట్టున్న ముక్కు, మెరుస్తున్న తెల్లరాయి ముక్కుపుడక, తైలసంస్కారం కొరవడినా, చింపిరిగా లేచివున్నా, నల్లగా నిగనిగలాడుతున్న వొత్తయిన జుట్టు, ఎర్రరిబ్బనుతో మలిచికట్టిన చిక్కని పాయల జడ... నిసర్గసౌందర్యం అంటే ఇదేనేమో. పెళ్లీడుకొచ్చిన పడుచుపిల్ల కూడా తన కుటుంబంతో కల్సి ఎర్రటి ఎండలో

వొళ్లు వంచి పనిచేయాల్సిరావడం, దారినపోయే లక్షలాదిమంది చెడు చూపుల తాకిడికి ఆమె మేని వంపుసొంపులు గురవాల్సి రావడం- ఎంతో బాధ కలిగించే సన్నివేశంలా తోచింది లోకనాథానికి. సభ్యతకాదని అటువైపు నించి దృష్టి మరల్చి తన బస్సు వస్తున్న దేమోనని చూసేందుకు దూరంగా రోడ్డు మలుపు వేపు చూపులు సారించాడు.

మే నెల మధ్యాహ్నపుటెండ భగభగమండుతోంది. సమయం రెండు కావ స్తోంది. ఎర్రటి ఎండలో బయటికి రావడానికి జనం భయపడుతున్నారు కాబోలు, రోడ్డు మీద ట్రాఫిక్ బాగా పలచబడింది. కొమ్మ ఊగదు, గాలి ఆడదు. రెండు బస్సులు బుర్రుమంటూ వచ్చి వెళ్లిపోయినై. కానీ అవి తను ఎక్కాల్సినవి కావు. వేపచెట్టు నీడన విశ్రమించిన కూలీలు- మూడు కుటుంబాల వాళ్లు గబగబా భోజనాలు కానిచ్చేస్తు న్నారు. ఉన్నట్టుండి వుయ్యాల్లోని పాప గుక్కపట్టి ఏడ్చింది, చెట్టు అవతలివైపు కొంచెం ఎడంగా కూర్చున్న వాళ్లలోంచి ఒక మహిళ పరుగున వచ్చి అయిదు నిమిషాలపాటు పాలు కుడిపి జోకొట్టింది.

భోంచేస్తున్నవారి కంచాల్లోని ఆహారపదార్థాల వాసన కమ్మగా గాల్లో తేలివచ్చి లోకనాథం నోట్లో నీరూరింది. ఆకలితో పేగులు గుర్రుమన్నాయి. తను యిల్లు చేరే సరికి ఇంకో గంటైనా పడుతుంది. బాటిల్‌లో వున్న నీళ్లన్నీ గడగడా తాగేశాడు. వేళకు తిండి, వేళకు నిద్ర... సమకూరితే అదృష్టమే. ఆట, పాట, ఆకలి, దప్పిక, అలసట... జీవితంలో ఎన్ని మలుపులెదురైనా ఆ బయలాజికల్ డ్రైవ్స్ ప్రకృతి సహజం. మరో ముఖ్యమైన బయలాజికల్ డ్రైవ్... అణచుకోవాల్సిందేనా?

❖

రాత్రి సమయమెంతో, కరెంటు ఎప్పుడు పోయిందో తెలియదు. మెలకువ వచ్చి లేచి కూర్చున్నాడు లోకనాథం. అర్ధరాత్రి దాటి వుంటుంది. వళ్లంతా చెమట. పక్కబట్టలూ తడిసి ముద్దయిపోయినై. తెరిచివున్న కిటికీ లోంచి ఉన్నట్టుండి ఒక గాలి తెమ్మెర సున్నితంగా గదిలోకి ప్రవేశించి చల్లగా శరీరాల్ని తాకింది. ఏసీని మించిన హాయితో నిమిషంపాటు తనువు పులకరించిపోయింది. కిటికీలోంచి కనపడుతూన్న ఆకాశం వైపు చూస్తే అనూహ్యమైన రీతిలో సన్నని వెలుతురు గదిలోకి ప్రసరిస్తోంది. ఆకాశంలో నిండు చందమామని, వెన్నెల వెలుగులలో స్నానమాడుతూన్న బయటి పరిసరాలను చాలారోజుల తర్వాత చూడగలిగిన తృప్తి ఆనందంగా మారి లోకనాథం మనసుప్పొంగింది. అతని నిద్రమత్తు పూర్తిగా ఎగిరిపోయింది.

పక్కన తన భార్య వసుమతి ఆదమరిచి నిద్రపోతున్నది. నేల మీద పరిచిన చాప, మెత్తని మూడు చద్దర్లు, తలగడలు, ఇరువురి నడుమ అడ్డుగోడలా గుండ్రటి దిండు... నవ్వొచ్చింది లోకనాథానికి.

పక్కలో ఆ చివర, గోడ దిక్కుగా పడుకున్న వసుమతి గాఢమైన నిద్రమత్తులో ఒత్తిగిల్లింది. మళ్లా దొర్లి దిండును కాళ్లకట్టవైపు తన్ని పెనిమిటికి దగ్గరగా వచ్చింది. తన ఎడమచేతిని అతని పొట్టమీద వేసి కుడిచేయిని తలగడ మీదుగా వెనక్కి వేసి నేలపై ఆనించింది. దీర్ఘంగా ఉచ్ఛ్వాస, నిశ్వాసలు తీస్తూంటే ఆమె ఛాతి లయబద్ధంగా కదలసాగింది. పైట కొంగు ఎటో జారిపోయింది. వొంటికి గాలి తగలడం కోసమని ఒకే హుక్కు పెట్టి వున్న జాకెట్లోంచి వక్షోజాలు దాదాపు పూర్తిగా బయటపడ్డాయి. చీర మోకాళ్లపైకి లేచింది. ఆమెకు నిద్రాభంగం కలగని రీతిలో మెల్లగా పక్కకు ఒత్తిగిల్లి, జాగ్రత్తగా ఆమె చేయిని తలగడ మీద నుంచి కిందికి దించి, తన కుడిమోచేతి మీద శరీర బరువును మోపి ఒక కొత్త వ్యక్తిని మొదటిసారి చూస్తున్నట్టుగా భార్యను తదేకంగా చూశాడు లోకనాథం. చెమటతో తడిసిన నున్నటి మెడ, వెన్నెల వెలుగులు పడి మెరుస్తున్న నిండు బుగ్గలు, బోర్లించిన బంగారు గిన్నెల్లా అగుపడుతోన్న వక్షోజాలు...

గదిలోని కాసింత చల్లదనమంతా ఆవిరైపోయినట్టూ, తన వూపిరి వేడెక్కినట్టూ తోచింది లోకనాథానికి. ఆ స్థితిలో తన భార్య భంగిమ, రూపం, ఆమె శరీరం నుండి వచ్చే ఒక రకమైన మత్తు పరిమళం- సబ్బు, టాల్కం పౌడర్, హేరాయిల్, సిగలోని మల్లెపూలు... అవన్నీ చెమటలో కరిగినప్పుడు వెలువడే చక్కని వింత వాసన... అతనిపై ప్రభావం చూపి సెక్స్ కోరికను మేల్కొలిపాయి. ఉండబట్టలేక ఆమె ఎదమీద చేయి వేసి పెదాలు అందుకునేందుకు ముఖం పైకి వంగాడు.

వసుమతి ఉలిక్కిపడి కళ్లు తెరిచింది. పెనిమిటి ఉద్దేశం పసిగట్టి అతణ్ని మోచేత్తో పొడిచి దూరం నెట్టింది. ‘‘ఛట్. ఇప్పుడిదేం పని?’’

‘‘ఉష్. అరవక. ఎన్నాళ్లయింది ఈ సుఖం లేక...? ఈ అనుభవమూ లేకపోతే జీవితం నిస్సారమే...’’

‘‘అయితే ఇప్పుడా...? ఇక్కడా? బుద్ధిలేకపోతే సరి. అవతలి గదిలో అమ్మాయి నిద్రపోయిందో లేదో... అగో... సన్నగా వెలుతురుందంటే ఇంకా చదువుకుంటున్నదన్న మాట...’’ అంటూ లేచి గట్టిగా ఆవులించింది వసుమతి.

పాలపొంగు మీద నీళ్లు జల్లినట్టయింది లోకనాథం మూడ్.

‘‘ఇంకో గది వుండే ఇల్లయినా తీసుకోవాల్సింది. ప్చ్...’’

‘‘చాలు. ఎన్ని ఇండ్లు మార్సుకుంటూ తిరుగుతం? ఎంత చెట్టుకు అంత గాలి. సిటీలో మన కిరాయి ఇల్లు ఇదే ఆఖరుది కావాలని నా కోరిక...’’ జాకెట్ హుక్కులు పెట్టుకుని చీర కాళ్ల నిండుగా సవరించుకుంటూ లోగొంతుకతో అంది వసుమతి. కూర్చుని ఇంకా ఏదో ఆలోచిస్తూన్న పెనిమిటిని సున్నితంగా అదిలించింది. ‘‘పడుచుపిల్లగానివనుకుంటున్నావా ఇంకా. ఈ వయసులో ఈ ఆలోచనలేందయ్యో...

అటు తిరిగి గమ్మున పండుకో. రేపు ఏదో ఆఫీసుకి వెళ్లేదున్నదేమో... అగో... రాత్రి రెండయింది. ఇంకో గంట గడిస్తే కాల్ సెంటర్ డ్యూటీ నుండి అబ్బాయి వస్తడు. మాట్లాడకింక. పిల్ల లేస్తుంది. దానికి పరీక్షలు దగ్గర పడ్డాయంట.''

ఆమె మరోసారి ఆవులించి లేచివెళ్లి గోడ మూలనున్న స్టూలు మీది కూజా లోంచి మంచినీళ్లు వొంపుకుని తాగింది. మరోగ్లాసు నింపి పెనిమిటికి అందించింది. చల్లనినీళ్లను అతడు గడగడా తాగేశాడు.

❖

రేడియోలో పాటలాగిపోయినై. వార్తలు వస్తున్నాయ్. పొద్దు కొద్దిగా అటు వాలింది. వేపచెట్టు చిల్లులు పడ్డ నీడ ఇప్పుడేమంత సౌకర్యంగాలేదు. చిన్నగా గాలి వీచి నాలాకంపును మోసుకొచ్చింది. దేనికీ చలించని ప్రాణుల్లా మట్టిపని కూలీలు మౌనంగా గిన్నెలు ఖాళీ చేస్తున్నారు.

''ఇంకా కూర వుందిరా మాతాన... తమ్మీ, ఇంద తీసుకో. అందరూ ఏసు కోండ్రి...'' అంటూ, జుట్టు బాగా నెరసి అందరికన్నా పెద్దావిడలా కనపడుతున్న మహిళా కూలి ఒకావిడ చెట్టు అవతలి నుండి వచ్చి ఇవతలి కుటుంబానికి ఓ పెద్ద గిన్నె అందించింది. జామూన్‌రంగు చీరావిడ ఆ కూరను పెనిమిటికి, కొడుక్కు వడ్డించి తన కంచంలోనూ వేసుకుంది. కూతురుకు వడ్డించబోతే వద్దన్నది. పప్పు, ఏదో ఆకుకూర వాసనతోపాటు మరో ఘాటు మసాలాకూర వాసన గాలిలో లేచి వచ్చింది. మట్టిపని చేసుకునే ఆ పల్లెటూరివాళ్లు తింటూన్న ఆహారపదార్థాలు ఏమిటా అని కుతూహలంగా గమనించాడు లోకనాథం.

దొడ్డు బియ్యపన్నం, పప్పు, గోంగూర, ఏదో ఊరగాయ పచ్చడి... వాళ్ల కంచాల్లో ఇప్పుడు ఎర్రగా నూనె తేలియాడుతూన్న చిక్కని శోరువలో నల్లటి ముక్కలు కనపడుతున్న కూర కలిసింది. ఉప్పు, కారం, దట్టంగా వేసి మసాలాలు కలిపి వండిన మాంసంకూర అది అని తెలుస్తున్నది. అది ఏం మాంసమో అనేది కూడా చూచాయగా అర్థమైంది. ఎర్రటి ఎండలో కండలు కరిగేలా చెమటలు పారించి, బండలు పిండిచేసే కాయకష్టం చేసేటోళ్లు సాధారణంగా తీసుకునే ఆహారపదార్థమది.

మాంసం కూరని వొత్తుగా అన్నంలో కలుపుకుని ఆ ఎర్రని ముద్దను చక్కగా నమిలిమింగాడు జామూన్ రంగు చీరావిడ పెనిమిటి. కారం ఘాటుదెబ్బకు ముక్కు కారుతూంటే ఎడమచేత్తో లుంగీ అంచుతో తుడుచుకున్నాడు. గ్లాసెత్తి గడగడా నీళ్లు తాగుతూ, అన్నాలు తింటూన్న తమ కుటుంబాలవేపే కుతూహలగా చూస్తూ నిలబడ్డ కళ్లద్దాల పెద్దమనిషిని గమనించాడు. ఏదో స్ఫురించినట్టుగా కలుపుగోలుగా నవ్వుతూ- ''సార్, శానాసేపయింది ఎదురుసూడబట్టి- ఇంగో అర్ధగంట దాకా బస్సులు నడవవ్.

డ్రైవర్లకూ,. కండక్టర్లకూ అన్నాలు తినే టయిం కదా యిది! ఇట్లచ్చి నీడకు ఈ వేరు మీద కూసో...'' అన్నాడు. అతని వంటిపై రంగువెలిసిన లుంగీ, మాసిన బనీను వున్నాయి.

ఔనన్నట్టుగా తల పంకించి చిన్నగా నవ్వాడు లోకనాథం. ఒకచోట నిల్చుంటే వంటికి గాలి తాకడం లేదు. మెడమీదా, చంకల్లోపలా ధారగా కారుతూన్న చెమట. లోపలి బనీను, పై చొక్కా వీపుకు అంటుకుపోయినై. రెండు నిమిషాలు అంటూ ఇటూ పచార్లు చేసి చెట్టు అవతలివైపు కూర్చున్న కుటుంబాలను సమీపించాడు. ఇందాక, కూర గిన్నెను ఇవతలివాళ్లకు అందించిన పెద్దావిడ భర్త కాబోలు- గళ్లలుంగీ, పైన కాటన్ బుష్షర్టు వేసుకుని తువ్వాలు తలపాగాలా చుట్టుకున్నాడు. అప్పుడే భోజనం ముగించేసి గోడవారగా పేవ్‌మెంట్ బండల దొంతర మీద కూర్చున్నాడు. బీడీ అంటించుకుని గాఢంగా రెండు దమ్ములు లాగాడు. లోకనాథాన్ని చూస్తూనే గౌరవ సూచకంగా బీడీ ఆర్పేసి, ఆ ముక్కను తలపాగాలో పెట్టుకుని లేచి నిలబడ్డాడు. అతన్ని లేవవద్దని వారిస్తూ లోకనాథం తనూ, ఎత్తుగా పైకి తేలిన ఒక వేరుపై కూర్చున్నాడు. మెల్లగా సంభాషణ ఆరంభించాడు.

''ఎప్పట్నుంచి, ఎప్పటిదాకా చేస్తరు ఈ గుంతలు తవ్వేపని?''

''పొద్దుగాల ఏడున్నర కొస్తం, సాయంత్రం ఆరుగంటలదాక తవ్వుతం. ఇంకా శానా దూరం వుంది తవ్వేపని...'' చెప్పాడా కూలీ. యాభైయేళ్లు పైనే వుంటుందతని వయస్సు. బక్కచిక్కినట్టు ఉన్న ముఖంలో ఎర్రని కళ్లు, కండలు దేలి దృఢంగా కన పడుతున్న వొళ్లు, చేతులు కాయలు కాసి వున్నాయి. దవడల మీద తెల్లగా కనపడు తున్న అయిదారు రోజుల గడ్డం.

''ఈ కందకం తవ్వుతున్నది కేబుల్ కోసమా, నీళ్ల పైపులకోసమా... మీ రోజు కూలీ ఎంతెంత వుంటుందో...''

''టేబుల్ డ్రైనేజి కోసం తవ్వుతున్నాం. అగో- అక్కడి చౌరస్తా చెమన్ కాణ్నుంచి రైలు వంతెన వరకు తవ్వాలె. మేం మొత్తం పన్నెండుమందిమి. గుత్తకు మాట్లాడు కున్నాం. కంట్రాక్టరు మేస్త్రీ మా వూరోడే. పనంతా అయినంక కూలీ గిట్టుబాటయితదనే నమ్మకంతో వున్నాం. అగో... అక్కడ కూర్చున్న నిక్కరు పిల్లగాడు- మా బామ్మర్ది కొడుకు- సదువుకున్నోడు. రోజూ పని కూళ్ల లెక్కలు వాడే రాసి పెడ్తడు...''

''మీ బామ్మర్ది అంటే... ఆ పూల లంగా తొడుక్కొనున్న పిల్ల తండ్రా?''

''ఔను. వాడే. వానికి ఇద్దరు ఆడపిల్లలు, ఒక కొడుకు. ఈడు నా చిన్నాయన కొడుకు. అక్కడ కూర్చున్నవాళ్లు నా కొడుకు, కోడలు. మేమంతా ఒక్కటే. బందు గులమే. పాలమూరు మాది.''

“ఓహ్. పాలమూరు గురించి తరచూ వింటూంటం. మీరు యవసాయం వదిలేసి నగరంలో కూలీపనులకు రావడం సరే, కానీ ఎదిగిన ఆడపిల్లలనూ వెంట తీసుకురావడమెందుకయ్యా.... ఇది బాగలేదు..”

“ఏం చేస్తమయ్యా... మూడెకురాల పొలం, అయిదెకురాల చెల్క వుంది. కానీ పంటల్లేవు. ఎందుకంటే నీళ్లు లేవు. వరుసగా మూడేళ్ల నుంచీ కరువే. ముసలోళ్లను ఇంటికాడనే ఉంచి, కాయకష్టం చేయగలిగిన వాళ్లమంతా ఇట్లా వలసొస్తం. మళ్లా వానకాలం ఊరెళ్లిపోతం. ఈడ ఇలాంటి కూలీ పనులుచేసుకుంటేనే నాలుగుపైసలు చేతుల మిగులుతయ్.”

“ఎంత సంపాయిస్తరు.. ఇరవై వేలా, ముప్ఫయి వేలా?”

“అంత వుండది. కానీ ఎంతో కొంత పైకం మిగుల్చుకుంటం. ఇంటి కర్సులు, అప్పులు వెళ్లదీసుకుంటం. ఏమన్నా మిగిలితే ఎరువులకు, మందులకు పెడతం. అగో..మా బామ్మర్దికి శానా పెద్ద కష్టం. మూడేండ్ల నుంచి ఆ పిల్ల పెండ్లి వాయిదా వేసుకొస్తున్నడు.”

“ఉయ్యాల్లోని చంటిది?..”

“నా మనుమరాలు. మూడేళ్ల కిందట పెండ్లి అయిన కొడుక్కు, కోడలుకు ఏం సుకం లేదు. కర్మ. ఊళ్లో ఉండలేం. నగరంలో ఎల్లకాలం కూలీ బతుకు బతుకలేము. ఏం జేస్తం, ఇక్కడ మాకు అలకగా దొరికే పని ఈ మట్టి పనే..”

వుయ్యాల్లోని పాపవైపూ, బొంతపై నడుంవాల్చిన పూల లంగా పిల్లవైపూ జాలిగా చూశాడు లోకనాథం. చూపుల్ని అలాగే పైకి, ఇంకా పైకి, అప్రయత్నంగా చెట్టుకొమ్మల మీదకు పోనిచ్చాడు. వుయ్యాల కట్టిన వేపచెట్టు చిటారుకొమ్మలు, రెమ్మలు వాడి ఎండిపోతునట్టుగా అగుపడ్డాయి. “అరరే.. ఆ కొమ్మ ఎప్పుడైనా విరిగి కింద పడుతుంది. జాగర్త..”

“ఔను. సూశిన. ఇంకొన్ని రోజులకు పూర్తిగా ఎండిపోతుంది. విరిగిపోతుంది. ఈ కాండంలో రెండు చెట్లున్నాయ్ చూసిండ్లా సార్... ఊడుగు చెట్టు, వేపచెట్టు. రెండూ పెనవేసుకుపోయి ఏపుగా పెరిగినయ్. కందకం తవ్వుతుంటే కొన్ని వేర్లు తెగినయ్. బహుశ వేపచెట్టు తల్లివేరు మీద బలమైన దెబ్బ పడి వుంటది..”

“తల్లివేరు దెబ్బతింటే ఎంత పెద్ద చెట్టయినా...?”

“అంతే. మూలాలు తెగితే ఏ చెట్టయినా ఎండిపోతుంది. మనుషులైనా అంతేకద సార్..” అని వేదాంతిలా నవ్వాడు బుష్ షర్టు వేసుకున్న కూలీ. ఏదో ఆలోచించి నిస్సంకోచంగా బీడీ తీసి వెలిగించాడు. ఎటో శూన్యంలోకి చూస్తూ గాఢంగా దమ్ములు లాగాడు.

డుగ్ డుగ్‌మంటూ నల్లని రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్‌బైక్ మీద తెల్లని ఖద్దరు బట్టలు ధరించిన గుత్తేదారు మేస్త్రీ, తన అసిస్టెంటుతో సహా రానే వచ్చాడు. మోటార్ బైక్ స్టాండు వేసి, రేబాన్‌కళ్లద్దాలు తీసి నెత్తిమీది క్యాపు సవరించుకున్నాడు. మగకూలీ జనమంతా బిలబిలమని అతణ్ని సమీపించి వినయంగా నిలబడ్డారు. అసిస్టెంటు టేపు అందించగా మేస్త్రీ, టేబుల్ డ్రైనేజీ ట్రెంచి వెడల్పు, లోతు కొలిచాడు. మెయిన్ రోడ్డు అంచున సుమారు మైలున్నర పొడవున మోకాలిలోతు తవ్విన ట్రెంచిని ఆ చివరి నుండి ఈ చివరివరకూ పరికించి చూసి అసంతృప్తితో ముఖం చిట్లించాడు. ఎండదెబ్బకు కందిన మొఖం కోపంతో మరింత ఎర్రబడింది. అతను సెల్‌ఫోన్‌లోని కాలిక్యులేటర్‌లో ఏవో లెక్కలు వేసి చెబుతుంటే నిక్కరు తొడుక్కున్న కూలీకుర్రాడు చిన్న నోటు పుస్తకంలో అంకెలన్నీ శ్రద్ధగా నోటు చేసుకున్నాడు.

మేస్త్రీ కూలీజనం వేపు చూస్తూ కుక్కలా మొరిగాడు. "బుద్ధి లేదు మీకు. డబుల్ పని పెట్టుకోవద్దని నూటొక్కసార్లు చెప్పిన. లోతు అరడుగు, వెడల్పు నాలుగంగుళాలు తక్కువగా ఉన్నాయ్. అగో.. అక్కడి ట్రాఫిక్ ఐలాండ్ దాకా ట్రెంచి తవ్వకం ఇట్లనే ముందుకుపోనిచ్చి- ఆ తర్వాత, ముందు తవ్వినదంతా సరిచేసుకునిరాండ్రి. ఈ స్ట్రెచ్ ఇవాళ అయిపోవాలి అర్థమైందా?.."

లోకనాథం వైపొకసారి అనుమానంగా చూసిన మేస్త్రీ మళ్లా కూలీల వైపు తిరిగి, "మందితో ముచ్చట్లెందుకు మీకు? పనిమీద ధ్యాసపెట్టుండ్రి. నగరంలో ఎవరెటు వంటోళ్లో మీకు తెలవది జాగర్త.." అనేసి బైక్ స్టార్ట్ చేసి వేగంగా వెళ్లిపోయాడు.

కూలీలు ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. ఎవరికివారే లోలోపల ఏదో గొణుక్కున్నారు. నడుం వాల్చినవాళ్లు, ఒరిగి కూర్చున్నవాళ్లు అందరూ లేచారు. స్త్రీలు చీరలు, మగవాళ్లు లుంగీలు ఎగలాగి బిగించారు. పలుగులు, పారలు, తట్టలు, బుట్టలు అందుకున్నారు.

"పిల్లా! కంచాలు, గిన్నెలు కడిగేసి గంపలో పెట్టెయ్యి జల్దిన. పెద్ద తట్ట నాకిచ్చి, చిన్నది అందుకుని ఇహ నడువ్.." అంది జామూన్ రంగుచీర కట్టినావిడ.

దూరాన్నించి ఒక బస్సు రావడం కనిపించడంతో లోకనాథం వెంటనే లేచి నిలబడ్డాడు. చాలాసేపు బస్ కోసం చూసిన కొందరు అప్పటికే ఆటోల్లో వెళ్లిపోయారని గమనించాడు. బస్ షెల్టర్‌వైపు అడుగులు వేస్తూ, హడావుడిగా లేచి గిన్నెలను, కంచాలను సర్దుతున్న పూలలంగా పడుచుపిల్ల మీదకు చూపులు పోనిచ్చాడు. లంగా పిక్కల పైకి లాగి గోచీలాగా బిగించిందామె. ఛాతీనిండుగా వోణీ చుట్టుకుని, దాని అంచులు నడుముకు చెక్కుకుంది.మోకాళ్ల మీద కూర్చుని కంచాలను, అన్నం కూరల గిన్నెలను ఒక్కదగ్గరికి చేర్చింది. బిందెలోంచి చెంబెడు నీళ్లు తీసి, వాటిని పొదుపుగా

వాడుతూ ఒక్కొక్క పాత్రను, కంచాన్ని కడిగి, చివరికి మిగిలిన అంట్లు నీళ్లను ఒక గిన్నెలోకి తీసుకుంది. లేచినిలబడి రోడ్డు అంచువద్దకు వెళ్లి గిన్నెలోని నీళ్లను మెల్లగా మట్టి కుప్పలో పారబోసింది. అంట్లు మట్టిలో ఆగిపోగా నీళ్లు తార్రోడ్డుమీదకు కారి పల్లంలో చిన్న చెలమ లాంటిది ఏర్పడింది. కావుకావుమంటూ చెట్టుమీద నుంచి నాలుగైదు కాకులు ఆ నీళ్లకోసం వాలాయి. అవి ఆబగా తాగే లోపలే పావు నిమిషంలో నీళ్లు ఆవిరైపోయాయి. నిరాశగా దిక్కులు చూసిన కాకులు మళ్లా అరుస్తూ తడిమట్టిలో కెలికాయి. గట్టిగా హారన్ మోగిస్తూ రయ్యిమంటూ బస్సు రాగానే కాకులు బెదిరి రివ్వున ఎగిరిపోయాయి.

ఇక్కడ ఎవడి గోల వాడిదే, ఎదుటి ప్రాణి గోడు వినే తీరికెక్కడ? కదలుతున్న బస్సు ఎక్కేశాడు లోకనాథం.

❖

ఆ యింటిలో కిరాయికి దిగిన గత మూడు నెలల కాలంలో ముఖ్యమైన విషయాలు కొన్ని నేరుగా మాట్లాడాలంటూ ఇంటి వోనరు తనను పిలవడం ఇది నాలుగోసారి. గ్రౌండ్ ఫ్లోర్‌లోని పెద్ద పోర్షనులో ఉంటారాయన. పిలిచిన కారణం ఊహించుకుంటూ, పై నుండి మెట్లు దిగి వోనరు కుటుంబం వాళ్ల గుమ్మం ముందు నిలబడ్డాడు లోకనాథం. ఉదయం తొమ్మిది గంటల సమయం. ఎండ పెరిగింది. కుమ్ములో పెట్టినట్టు ఉక్కపోత మొదలైంది. చెట్ల కుండీలకూ, పార్క్ చేసిన కారుకు మధ్య స్పేస్‌లో నుంచి తన కొత్త మోడల్ బైక్ తీస్తూ, సుమారు పాతికేళ్లున్న యువకుడు- అతడు ఇంటి యజమాని కొడుకు, పొడుగ్గా వున్న ఆ కుర్రాడు చాలా స్టైలిష్‌గా డ్రెస్ చేసుకున్నాడు- కిరాయిదారు వైపు ఒక నిర్లక్ష్యపు చూపు విసిరి, బైక్ స్టార్ట్ చేసి బుర్రుమంటూ గేటు దాటాడు.

కాలింగ్ బెల్ నొక్కి, పది సెకన్లు ఆగి గడపలోపల అడుగుపెట్టాడు లోకనాథం. టేకుతో చేసిన బలిష్టమైన దర్వాజా, అందమైన వినాయకుని బొమ్మ కింద పూర్ణకలశం చెక్కిన రెండు పలకల పెద్ద తలుపు. ఇంటి లోపల ఇంతకుముందు చూసిన దృశ్యమే. బేతంచెర్ల బండ ఫ్లోరింగు, దృఢమైన గోడల విశాలమైన హాలులో పాతకాలపు షెల్ఫులు, అడ్డగోలుగా అమర్చిన అనేకరకాల వస్తువులు, ఫర్నిచర్, చెక్క కుర్చీలు, పనినైపుణ్యం లోపించిన కప్‌బోర్డులు. హాలు మధ్యలో అధునాతన డిజైన్ లెదర్ సోఫా సెట్టు- ఆ ముతక పర్యావరణంలో వింతగా కనపడుతోంది. ఆ వాతావరణంలో అడుగుపెట్టిన అర నిమిషంలోనే అదోరకపు గెదడు వాసనలాంటిది లోకనాథం ముక్కుపుటాల్ని తాకింది.

మొరిగినట్టూ కాని, ఘుర్ఘురించినట్టూ కాని వింతశబ్దం వెలువరిస్తూ సోఫా చాటు నుండి వోనరు వాళ్ల పెంపుడు కుక్క  బయటికి వచ్చింది. ఇంటి యజమాని కుటుంబంవాళ్లు అల్లారు ముద్దుగా చూసుకునే ఆ జర్మన్‌షెఫర్డ్ జాతి కుక్క తలెత్తి లోకనాథాన్ని చూస్తూ అతని కాళ్ల దగ్గర ఒక ప్రదక్షిణ చేసింది.

ఆ కుక్కను చూస్తే లోకనాథానికి అసహ్యం. మొదటిసారి చూసినప్పుడు అది బక్కచిక్కిన ఎలుగుబంటిలా కనపడింది. అతనికి వొణుకు పుట్టించింది. తల, వీపు భాగం తోకవరకు నలుపు. ముట్టె, పొట్టకింది భాగం ముదురు గోధుమరంగు. పుసులు కారే నల్లని కళ్లలో తేనేరంగు కనుపాపలు. దాని పొట్ట ఉబ్బినట్టు, ముందు కాళ్లకన్నా వెనకకాళ్లు కురచగా వున్నట్టు కనపడ్డాయి. కత్రలాగా బిగదీసుకుపోయిన తోక కిందికి వాలి వుంది. అది హైనాలా నడిచివచ్చి, పులిసిన పాలలో నీచుకంపు కొట్టె డాగ్ బిస్కట్లు నానిన వెగటు వాసన వెదజల్లుతూ, గురుగురుమంటూ వికృతంగా అరిచి లోకనాథం కాళ్ల దగ్గర మురికి చూసేసరికి అతనికి వొళ్లు జలదరించింది.

కుక్కను తప్పుకుని ముందుకు అడుగేసి, ''నమస్తే యాదయ్యగారూ!'' అన్నాడు లోకనాథం.

''ఆ... నమస్తే. నాథం సార్? అట్లా కూకోండి...'' అనే మాటలు, ఆ తర్వాత బ్రేవుమంటూ త్రేన్చిన చప్పుడు డైనింగ్ హాల్ వేపు నుంచి వినవచ్చాయి.

వొంటిమీది బంగారు నగలే అసలు ఆహార్యంగా గల ఇంటావిడ వచ్చి లైట్ స్విచ్చాన్ చేసి, ఏ భావమూ లేని చూపొకటి విసిరి, ఇస్త్రీ, చలువ తదితర సంస్కారాలకు నోచుకోనంత నిర్లక్ష్యానికి గురయిన తన ఖరీదైన పట్టుచీర సరసరమంటూండగా విసవిసా లోనికి వెళ్లిపోయింది. గాలి, వెలుతురు వద్దనుకున్నట్టుగా అన్ని వైపుల నుంచీ మూసేసిన ఆ యింటి లోపలి భాగాలు ట్యూబ్‌లైటు వెలుగులో మరింత స్పష్టంగా దృగ్గోచరమయ్యాయి. డైనింగ్ టేబుల్ అటువైపు కుర్చీలో కూర్చుని టిఫిన్ తినడం ముగించిన లావుపాటి యువతి ఒకావిడ- ఆమె ఆ యింటి కోడలో, కూతురో తెలియదు- లేచి ఆగంతుకుడిని క్షణకాలం ప్రశ్నార్థకంగా చూసింది. డైనింగ్ టేబుల్ వెనకాల గోడకు అమర్చివున్న లార్జ్ స్క్రీన్ టీవీలో చానెల్ మార్చి, సౌండ్ తగ్గించి తెర వెనకాల సింక్ వైపు నడిచి కనుమరుగైపోయింది.

రెండు గుప్పిళ్ల మొలకగింజలు, ఒక పచ్చని ఆకుకూర కట్ట అరనిమిషంలో పరపర నమిలేసింతర్వాత, ఒక పెద్ద సైజు క్యారెట్ దుంప చేతపట్టి కత్రున కొరుకుతూ, పార్టిషన్ కర్టెన్‌ను ఎడమచేత్తో కొంచెం దగ్గరికి గుంజి, తను కూర్చున్న కుర్చీని టక్కున ఇటు జరిపి, మెడకాయను భారంగా తిప్పి లోకనాథం వైపు చూశాడు ఇంటివోనరు యాదయ్య.

''జాకీ! నిన్నే, ఇటు వచ్చెయ్.'' నోట్లోని చిన్న చిన్న క్యారెట్ ముక్కలను తుంపరతోపాటు స్వేచ్ఛగా వర్షిస్తూ వింత జంతువు సకిలించినట్టుగా పెంపుడుకుక్క జర్మన్ షెపర్డ్‌కు సూచన చేశాడు యజమాని.

''భయపడకు నాథం సార్. మీరు దానికి ఎరికే కద. ఏమి అనదు. అయినా వయసయిపోయింది ముసలి కుక్కకు. మా పిల్లగాడు పదేళ్ల వయసులో ఉన్నప్పుడు- ముచ్చటపడి వారం రోజుల కూనను తెచ్చి సాదుకుందామని మారాం చేసిండు. సరే నన్నా, అప్పట్నుంచీ ఈ కుక్కను మా కొడుకు తీరుగనే చూసుకన్నాం. అప్పుడు మహా వుషారు ఇది. గేటు సప్పుడయితే చాలు- భీకరంగా మొరిగేది. ఉచ్చపడేది వచ్చే టోళ్లకు.''

మహా చిరాకేసింది లోకనాథానికి. ఎప్పుడు కలిసినా ఇంటి వోనరు సొంత డబ్బాతోనో, సొల్లు కబుర్లతోనో ఇలాగే ఉపోద్ఘాతం మొదలుపెడతాడని అతనికి తెలుసు. వెంటనే టాపిక్ మార్చాడు.

''ఎందుకో పిలిచారు నన్ను?''

యాదయ్య ఏమీ మాట్లాడలేదు. ఫోన్‌లో మేసేజ్‌లు చూస్తూండిపోయాడు.

''ఇంటి కిరాయి గురించి మాట్లాడేందుకేనా? మిమ్ముల కలిసి చెబుదామనే అనుకుంటున్నా. పెన్షను ఇంకా రిలీజ్ కాలేదు. కారణం తెలుసుకునేందుకు మళ్లా వెళుతున్నా ఆఫీసుకు. ఏదేమైనా- ఇంకో నాలుగైదు రోజుల్లో కిరాయి, అడ్వాన్సు పూర్తిగా ఇచ్చేస్తా...'' చెప్పాడు లోకనాథం.

ఏ భావమూ వ్యక్తపరచలేదు యాదయ్య. జర్మన్ షెఫర్డ్ భారంగా నడుస్తూ వెళ్లి యజమాని సమీపంలో కూర్చున్నది. వంగి దాని తలను ప్రేమగా నిమిరాడు యజమాని. అతని జబ్బలమీదా, మెడకాయమీదా వీశెలకొద్దీ కండ. ఆ కండల బరువుకు కొద్దిగా గూనిపడ్డ భారీకాయం. అతను అచ్చం కూర్చునున్న హిప్పో పోటమస్‌లా కనపడ్డాడు. నల్లని చర్మం వొలిచి కళేబరాన్ని తవక్కళ్ బీఫ్ షాపులో వేలాడదీయవచ్చుననిపించింది లోకనాథానికి.

''అద్సరే... కానీ- '' గొంతు సరాయించుకున్నాడు యాదయ్య. అతని మనసులో మరోటి వుంది. తన ఆధిక్యత ప్రదర్శించుకుని తృప్తిపడేందుకు ఎదుటి వాళ్లలో ఏదైనా లోపాన్ని వెతుకుతాడు, అశక్తతను పట్టుకుని కార్నర్ చేస్తాడు. అతని మనస్తత్వాన్ని చూచాయిగా పసిగట్టేశాడు లోకనాథం. చేతులకున్న తడిని ముంజేతుల మీద రుద్దుకుంటూ కిరాయిదారువైపు సూటిగా చూశాడు యాదయ్య. అంతలో సెల్‌ఫోన్ మోగితే ఎత్తి మాట్లాడాడు. ''ఇగో, గంటలో సైటు కాడ వుంటా. ఆ... పార్టీని రమ్మను...'' అన్నాడు బిగ్గరగా అవతల వ్యక్తితో. తర్వాత లోకనాథంతో, ''మీకు ఇప్పటికే

రెండుసార్లు చెప్పిన చుట్టాలను, దోస్తులను ఒకట్రొండు రోజులకు మించి ఉండ నీయొద్దు. నీళ్లు ఎక్కువగా పారబొయ్యవద్దు. ఇది సిటీ. ఎండకాలంలో నీళ్లకు ఎంత కటకటో తెలిసి మసలుకోవాలె. ఇంకో సంగతి. అర్ధరాత్రి దాటినంక గేటు తీసుడు బందు,'' అన్నాడు.

కోపాన్ని, అసహనాన్ని నిగ్రహించుకున్నాడు లోకనాథం. ''నీళ్లు వృథా చేసేటోళ్లం కాదు మేము. స్నానాలకు, వాషింగ్‌కు పొదుపుగానే వాడుతాం. పోతే- నాలుగు కుండీల్లోని పూలమొక్కలు, రోజుకు అయిదారు చెంబుల నీళ్లు పోస్తారు. అది ఆడవాళ్ల మక్కువ. కాదనరాదు. ఇక చుట్టాలు పక్కాలు రాని ఇల్లంటూ వుంటుందా? మీరు అంటున్నారు కాబట్టి ఎయిర్ కూలర్ కొనాలా, వద్దా- మళ్లా ఆలోచించుకుంటాం. గేటుకు తాళమేస్తానంటే ఎట్లా ? మా అబ్బాయి వచ్చే టైమది...''

నొసలు చిట్లించి చూసి లేచి నిలబడ్డాడు యాదయ్య. ఒక చేత్తో బుర్రమీసం దువ్వుకుంటూ మరో చేత్తో ధోవతి మడతలు సరిచేసుకున్నాడు. రెండు చేతుల వేళ్లకు మొత్తం ఎనిమిది ఉంగరాలు, కుడిచేతికి అరకిలో బరువుండే కడియంలాటి బ్రేస్ లెట్... తళుక్కున మెరిశాయి. అతని నల్లని, ఎత్తైన బొజ్జమీద తెల్లని గ్లాస్కో దోవతి ఎంత గట్టిగా బిగించినా నిలవనంటోంది. ప్రకృతి చికిత్స, ఆహారవైద్యం... లాంటివి ఎంత పాటించినా నడుము సైజు తగ్గుతున్నట్టు లేదు.

''పత్రికలో పన్జేసే ఆ పెద్దాయన... చారిసాబ్ తరపు మనిషివని అడ్మాన్సు పూర్తిగా ఇవ్వకున్నా ఇంట్లకు రానిచ్చినా నిన్ను. కిరాయి కూడా తక్కువగానే తీసు కుంటున్నా. ఇగో, చూడు... నాథం- నువ్వు మాట్లాడే పద్ధతి బాగలేదు.''

''రోజుకో రూల్ చెప్పి మీరు మమ్ముల సతాయించుడు కూడా బాగలేదు. మాకు ఇల్లు కావాలి. మీకు కిరాయి రావాలి. ఇది మనిద్దరి అవసరం. ఔనా కాదా?''

లోకనాథం వైపు గుర్రుగా చూశాడు యాదయ్య. కోపంతో ముఖం ఎర్రబడింది. ''నేనేదో చెబితే నువ్వేదేదో మాట్లాడుతున్నావ్. మీది పట్వార్ల కులమా, జమీందారీ వంశమా? ఏంది భాయ్... మీకు ఎకరాలకొద్దీ పొలాలు, తోటలు ఉండేవా? మీ ఇంటెనుక నిత్యం పారే గంగానది కానీ వుండేదా?''

ఆ వెటకారపు మాటలకు తీవ్రమైన కోపం వచ్చింది లోకనాథానికి. కష్టం మీద తమాయించుకున్నాడు. ''స్పష్టంగా చెప్తున్నా వినండి. నేను రిటైరయిన ప్రభుత్వోద్యోగిని. ప్రశాంతమైన, విస్తారమైన, సస్యశ్యామలభరితమైన పర్యావరణంలో బతికాను. నీటైన రోడ్లు, ఎత్తైన చెట్లు, ప్రకాశవంతమైన వెలుగునిచ్చే వీధి దీపాలు, పచ్చగా కళకళలాడే పార్కులు... ప్రణాళికాబద్ధంగా నిర్మితమైన టౌన్‌షిప్‌లో విశాలమైన ప్రాంగణం వున్న మూడు గదుల పెద్ద ఇంటిలో నివాసముండేవాళ్లం. క్వార్టర్స్ ముందు రెండు కొబ్బరి

చెట్లు, ఇంటి వెనుక రెండు గున్నమామిడి చెట్లు, ఒక ఎర్రజామచెట్టు, ఒక గుత్తి నిమ్మచెట్టు. ఇంటి ప్రాంగణం మూడువైపులా పెట్టని ప్రహరీగోడలా సీతాఫలంచెట్ల వరుస. ఇంటి ముందు వాకిట్లో ముద్దమందారం చెట్లు, గులాబీమొక్కలు. ఇంటిపైకి పాకిన జాజిమల్లె తీగ. ప్రాంగణం మూలన రోడ్డు వైపు పారిజాతం చెట్లు. మాకు అయిదు మైళ్ల దూరాన గలగలా పారే గోదావరి నది. ఇంటేక్ వెల్ నుండి ఫ్యాక్టరీకి రోజూ లక్షల గాలన్ల నీటి సరఫరా. చుట్టూరా పల్లెటూళ్ల నుండి రైతులు బండ్లకొద్దీ కూరగాయలు, ఆకుకూరలు, పవర్‌ప్లాంటు రిజర్వాయర్ నుండి బెస్తవాండ్లు తాజా చేపలు... నిత్యం మార్కెట్‌కు తెచ్చేవాళ్లు. కారుచౌక ధరలు. మా యింటి చెట్లకు కాసిన పండ్లు సగం పక్షుల పాలయినా మిగిలినవి మా అవసరాలకు మస్తుగా సరి పోయేవి. దేనికీ కరువనేది తెలియదు...''

జానపదకథనో, బాలల ఫెయిరీటేల్‌నో వింటున్నట్టుగా విస్తుపోయి చూశాడు యాదయ్య. వెంటనే ముఖాన్ని గంభీరం చేసుకున్నాడు. ''కతలు బాగానే చెప్తతవ్ భాయ్. సొర్గమసోంటి ఆ చోటు విడిచిపెట్టి ఇక్కడకెందుకచ్చినట్లో...?''

''పరిస్థితులు. ప్రభుత్వ విధానాలు. ఇప్పుడు గట్టునపడ్డ చేప చందం అయింది బతుకు. గతమంతా గడిచిపోయినా, ఎప్పుడూ గుర్తుండే బంగారు కల అది...'' అన్నాడు లోకనాథం.

''కలల్లో తేలిపోవద్దు. వెనుకట మేం పల్లకీలో ఊరేగేటోళ్లం. పూర్వం మా నాయిన ఏనుగు అంబారీలో తిరిగేటోడు, పూర్వం మా తాత నైజాం దగ్గర సుబేదారు... అనుకుంటూ పోకడపోతే లాభంలేదు. ఇప్పుడెక్కడ ఉన్నాం, ఎట్లున్నాం అనే సోయి దెచ్చుకొని నడుచుకోవాలె..'' యాదయ్య వాక్ప్రవాహం తన సహజధోరణిలో సాగి పోయింది.

ఇంకొక్క క్షణం అక్కడ ఉండలేననిపించింది లోకనాథానికి. సోఫాలోంచి దిగ్గున లేచి బయటికి నడుస్తూ అన్నాడు, ''ఇక చాలు... బస్ కరో. నాలుగు రోజులు పోయాక కలుస్తా. కిరాయి డబ్బులతో సహా. ఇంకోసారి ఈ సలహాలకు, ఇలాంటి సూక్తులకు అవకాశం రానీయను, సరేనా?''

కిరాయిదారువైపు ఒక నిముషం గుడ్లప్పగించి చూశాడు యాదయ్య. వెంటనే తేరుకుని దవడలు బిగించాడు. కుర్చీని విసురుగా వెనక్కునెట్టాడు. ''అర్రే, అర్ధగంట వేస్టయింది. ఛట్. ఏమమ్మా- పిల్లగాండ్లను తయారుచేయి జల్దిన. కారు తీస్తున్నా. స్కూల్లో దింపి వెళతా...'' అని పెద్ద గొంతుతో లోపలున్న భార్యను కేకేశాడు. బనీను తొడుక్కుని హాల్లోకి నడుస్తూ, బద్ధకంగా పండుకుని కాళ్లకడ్డంగా వున్న పెంపుడు

కుక్కను కోపంగా అదిలించాడు- ‘‘జాకీ.. ఛల్ లే. జరగమంటే తొవ్వలకెల్లి లేవమేమే... తోలుమందం బేవకూఫ్! వయసైపోయినా నిక్కుడు, నీల్గుడు తగ్గలేదేమే నీకు. గేటు బయట కట్టేస్తే నీ బతుకేందో తెలుస్తుంది...’’

గుమ్మం దాటిన లోకనాథం ఆ మాటలు విని పళ్లు కొరికాడు. ‘డబ్బు మదంతో పులిసిపోయిన పంది వెధవ...’ అని మనసులో తిట్టుకున్నాడు.

❖

సడెన్ బ్రేక్‌తో బస్ ఆగింది. వెనకాల వస్తున్న కార్లు, ఇతర బస్సులు, ఇరు వైపులా ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు కీచుమంటూ ఆగిపోయినై. ట్రాఫిక్‌జామ్ అని అర్థమయింది అందరికి. అయిదు నిమిషాలు, పది నిమిషాలు... సుమారు అర్ధగంట పాటు ట్రాఫిక్ స్థంభించిపోయింది. వాహనాలరద్దీ ఎక్కువలేని ఆ సమయంలో, మధ్యాహ్నం రెండున్నర గంటలప్పుడు- ఎందుకు ట్రాఫిక్‌జామ్ అయివుంటుందో రకరకాలుగా ఊహించుకోసాగారు జనం. బుర్రు బుర్రుమంటూ వాహనాలు వెలువరించే పొగ, బూమ్మంటూ హారన్ల మోత. అందరికీ తొందరే. బయట భగభగ మండుతున్న ఎండ. బస్సు లోపల కుమ్మరి ఆములో ఉన్నట్టు వేడి, సెగ. భరించరాని ఉక్క పోత.

కిటికీలోంచి తల బయటికి సాచి అడిగాడు లోకనాథం... ‘‘అసలు ఏమయిందట?’’

‘‘యాక్సిడెంట్ అయింది ముంగట. ట్రాఫిక్ క్లియర్ కావడానికి ఎంత టయిం పడుతుందో చెప్పలేం...’’ ముందున్న వాళ్లు మాట్లాడుకోసాగారు.

బస్సుల్లోని ప్రయాణీకులు నిట్టూరుస్తూ బిలబిలమంటూ దిగారు. కొంచెం గాలి ఆడింది కానీ, నిప్పులు చెరుగుతోంది ఎండ. పెనం మీంచి పొయ్యిలో పడ్డామా, పెనం మీదికి ఎక్కామా- అర్థంకాక జనం ఉక్కిరిబిక్కిరవసాగారు.

ఎదురుగా అల్లంత దూరాన కనపడుతున్న దృశ్యాన్ని చూపిస్తూ బస్ డ్రైవర్ అంటున్నాడు. ‘‘బాడ్కావులకు దిమాకు లేదు. చదువు సంజలుండి ఏం లాభం- పిచ్చికుక్కల తీరుగ కొట్లాడుకుంటున్నరు చూడుండ్రి... గా హౌలెగాండ్లను...’’

‘‘అందరూ నిలబడి చూస్తున్నారు. ఇంకా ఎంతసేపు ఈ డ్రామా?’’

‘‘ట్రాఫిక్ పోలీసులు ఏడున్నారో...?’’

‘‘ఈ ఎండలో ఎవడన్నా డ్యూటీలో వుంటడా... మిడతలా మాడి చావడానికా...?’’

తలా ఒక మాట అనుకుంటున్నారు. కానీ ఎక్కడి వాళ్లక్కడే నిలబడిపోయారు.

రోడ్డు డివైడర్ అంతమైన యూ-టర్న్ పాయింటు వద్ద, అశ్వారూఢుడైన శివాజీ విగ్రహం వున్నచోట- కుడివైపు యూ-టర్న్ తీసుకుంటున్న ప్యాషన్ బైక్, సబ్‌లేన్‌లోంచి మెయిన్ రోడ్డెక్కుతున్న పల్సర్ బైక్- రెండూ బలంగా ఢీకొన్నాయి. రోడ్డుమీద ఎర్రటి ఎండ... ధారాళంగా కారిన పెట్రోలు, ఆయిల్, నెత్తురు... చెల్లాచెదురుగా పడిపోయిన వాచీ, సెల్‌ఫోన్, కళ్లజోళ్ల ముక్కలు... ఒక హెల్మెట్, ఒక పర్స్... వెదజల్లినట్టుగా పడిన గాజుపెంకులు.

''నేను కుడివైపు బైక్ తిప్పేది చూస్తనే వున్నవ్. మరి అంత స్పీడ్‌గా రోడ్డు మీదకు ఎందుకొచ్చినవ్‌రా లంజాకొడకా...''

''నువ్వే మస్తు స్పీడ్ మీదున్నావ్. లాంగ్ టర్న్ తీసుకున్నావ్. నీ బండికి బ్రేకుల్లేవా, సువ్వర్ నాకొడకా. బైక్ మీద స్టైల్‌గా కూర్చోగానే సరా... కంట్రోల్ చేసుకునే సత్తా వుండొద్దా... నీ అయ్య...''

''మళ్లా అదేమాట. ఎక్కడి జాతిరా నీది. తాగున్నావా? నీ యమ్మ, నీ యాలిని... నికి ఉరికిచ్చినవా?''

''నీ యమ్మ... నీ అక్క...లో కత్తిపెట్టి చింపుత ఏమనుకుంటున్నావో..''

ఇరువురి నోళ్ల నుంచి కురిసిన బండబూతులు, తిట్టుకునే దశ దాటి ఇక కొట్టుకునే దశలోకి వచ్చారు. ప్యాషన్ బండతనికి హెల్మెట్ లేదు. కిందపడ్డప్పుడు కణతల దగ్గర తీవ్రగాయమై రక్తం కారుతోంది. కుడి మోకాలు సరిగ్గా నిలపలేక పోతున్నాడు. వంగిపోయిన చలువ కళ్లద్దాల ఆకృతి మారింది. కుడిమోచేయి బాగా గీరుకుపోయింది. అదిమి పట్టుకున్న ఎడమచేతి ఉంగరాలకు, వొంటిమీది బంగరు రంగు ఖద్దరు శిల్కు చొక్కాకు రక్తం బాగా అంటుకుంది. క్యాప్‌తో మధ్యమధ్య ముఖం మీద కారుతున్న రక్తాన్ని తుడుచుకుంటున్నాడు.

పల్సార్ బండతనికి ఎడమజబ్బ దగ్గర షర్టు పొడుగూతా చినిగిపోయింది. కుడికాలి చెప్పు ఊడి వేళ్లు చితికిపోయినట్టుగా కనపడుతున్నాయి. చీలమండ వద్ద పెద్ద గాయం నుండి రక్తం రోడ్డు మీదకు కారింది.

ఇద్దరి వాదనల సారాంశం ఒక్కటే. తప్పు తనది కాదంటే తనది కాదు- ఎదుటి వాడే నిర్లక్ష్యంగా, వేగంగా వచ్చి తన బండికి డాష్ ఇచ్చాడు! ఆవేశంతో దిబ్బడ దిబ్బడ బాదుకున్నారు. వీర శివాజీ ఆవహించినట్టుగా భీకరంగా కలియబడుతూ రోడ్డు మీద పడి దొర్లారు. విచక్షణారహితంగా గుద్దుకున్నారు. ఒకడి మూతి దారుణంగా పగిలింది. మరొకడి కనుబొమ లోతుగా చీలింది. చొక్కాలు చీలికలు పేలికలైనాయి. ఇరువురి ముఖాలు భీభత్సంగా రక్తసిక్తమైనాయి.

చుట్టూ పదులు కాదు వందలు, వందలాది జనం సినిమాలో స్టంట్ సీన్ వీక్షించినట్టుగా వినోదం చూడసాగారు. అట్నుంచి వస్తున్న అంబులెన్సు నిర్విరామంగా హారన్ మోగిస్తున్నది. కల్పించుకుని, పరమ మూర్ఖంగా తన్నుకుంటున్న ఆ ఇరువురినీ విడదీసి శాంతింపజేయాలన్న ఇంగితంగానీ, చొరవగానీ చుట్టూ వున్నవాళ్లలో ఎవరి లోనూ కనబడలేదు. అందరూ చోద్యం చూస్తున్నారు. కొందరు ఆ ఫైట్‌ను సెల్‌ఫోన్లలో చిత్రీకరించేందుకు యాంగిల్ వెతుకుతున్నారు. బాస్టర్డ్స్.

ఆ కొట్లాట దృశ్యం హృదయవిదారకంగా కనిపించింది లోకనాథానికి. బండ్లు గుద్దుకోవడం మూలంగా గాయపడి  కూడా ఆవేశకావేషాలతో మళ్లీ రెచ్చిపోయి రక్తం కారేటట్లు కొట్లాడుకుంటున్న ఆ యిద్దరు ఇడియట్స్‌ని చూసి జాలి కలిగింది. అతడు గుంపును చీల్చుకుని గబగబా ముందు కురికాడు.

‘‘అరే, మీరు మనుషులా, పశువులా? మీకన్నా ఆ వీధికుక్కలు, అడవి దున్నపోతులు నయం. పిచ్చి బాడ్కావుల్లారా, పోట్లాడుకోవడం ఆపండి...’’ అంటూ దెబ్బలాడుకుంటున్న ఆ ఇద్దరి మధ్యన జొరబడి, బలమంతా ఉపయోగించి వారిని విడదీశాడు, దూరంగా నెట్టేశాడు. ప్యాషన్ బండతను పూర్తిగా అలసిపోయాడు. పల్సర్ బండతనిదీ అదే పరిస్థితి. భారంగా ఊపిరి తీసుకోసాగాడు. నీరసం ఆవహించిన వారిరువురూ అదే అవకాశంగా భావించి ఆగిపోయారు. రొప్పుతూ మూతి మీది రక్తం కర్చీఫ్‌లతో తుడుచుకోనారంభించారు.

చుట్టూ వున్న జనంలో కదలిక మొదలయ్యింది. తలోమాట అంటూ సానుభూతి కురిపించారు. క్షతగాత్రులను ఇంకా దూరం తీసుకుపోయి నీడలో కూర్చో బెట్టారు. కొందరు పడిపోయిన మోటార్‌సైకిళ్లను లేవనెత్తేందుకు సన్నాహాలు ఆరంభించారు. వీధి సందులోని జ్యూస్‌స్టాల్‌లో కూర్చుని సేదదీరిన ట్రాఫిక్ జవాను తాపీగా రంగప్రవేశం చేశాడు. ఆ వెనుకే వచ్చిన మరో ఇద్దరు పోలీస్ కానిస్టేబుళ్లు, దూరం తొలగమంటూ జనంపై హూంకరిస్తూ లాఠీలు ఝుళిపించారు.

‘‘ఏం చూస్తున్నారయ్యా, బుద్ధిలేని జనం. వాళ్లు పిచ్చికుక్కల తీర్గ గింతసేపు కొట్లాడుకుంటే చూస్తూ నిలబడతారా? అందరూ కండలు పెంచిన వీరోల్లెక్కనే కనపడతరు. ఎవని కండలు వాడు చూసుకుంటూ మురిసిపోవుడేకాని... ఇంకేమీ చాతకాదు. ఈ పెద్దమనిషికున్న ఇంగితం మీకు లేకపాయ... అందరికన్నా ముందు ఎట్లా చొచ్చుకుపోయిండో చూసింద్రుకద... సిగ్గుపడాలె మీరందరు... ఇకపొండ్రీ ఎక్కడోళ్లక్కడ...’’ అని జనం మీద కేకలేశాడు ట్రాఫిక్ పోలీసు. తర్వాత లోకనాథం వైపు చూస్తూ, ‘‘వెల్‌డన్ మాస్టారూ...’’ అన్నాడు మెచ్చుకోలుగా.

గుంపు చెదిరింది. ట్రాఫిక్ కదలికకు అడ్డంకులు తొలిగాయి. అందరూ బస్సులెక్కేశారు. క్రమంగా వాహనాల గేర్లు మారాయి. కిటికీలోంచి గాలి వొంటికి సోకగానే లోకనాథం హాయిగా ఊపిరిపీల్చుకున్నాడు. బస్సునిండా జనం. చాలామంది అతన్ని పట్టించుకోలేదు. గుర్తుపట్టిన వాళ్లు అదోలా చూశారు. తర్వాతి స్టేజి వద్ద ముందు సీటు ఖాళీ అయింది.

"ఆ సీటులో కూకోండి సార్..." అన్నాడు చనువుగా కండక్టర్.

సీనియర్ సిటిజెన్స్ సీటులో కూర్చోవాలా వద్దా అనే మీమాంసలో కొద్ది క్షణాలు పడ్డాడు లోకనాథం. నిలబడి ప్రయాణించడం అతనికి సమస్యగా అనిపించలేదు. అయినా, అతడు అటువైపు కదిలే లోపులే ఆ సీటు కోసం వేరే ఇద్దరు ముగ్గురు పోటీపడ్డారు. జీన్స్ టీ షర్టులు వేసుకున్న ఆ కుర్రవాళ్లు నిజమైన వయోవృద్ధుల్లాగా కనబడ్డారు లోకనాథానికి.

*దక్కన్ ల్యాండ్*
*జులై, ఆగస్ట్, సెప్టెంబర్ 2018*

✻



**ఆడెపు లక్ష్మీపతి** 5 మార్చి 1955న కరీంనగర్ జిల్లాలో జన్మించారు. వీరి మొదటి కథ ఆదర్శం 1972లో ప్రగతి వారపత్రికలో అచ్చయింది. రామగుండం ఎరువుల కర్మాగారంలో 30 ఏళ్లు పనిచేసి 2002లో స్వచ్ఛంద పదవీవిరమణ చేశారు. 1997లో నాలుగు దృశ్యాలు కథా సంపుటి ప్రచురించారు. రావిశాస్త్రి స్మారక సాహిత్య అవార్డుతోపాటు ఇతర అవార్డులు అందుకున్నారు. పలు సాహితీ విమర్శ వ్యాసాలు రాశారు. ప్రస్తుతం అనువాద వ్యాసంగం చేపట్టారు.

**చిరునామా: అంబర్‌పేట్, హైదరాబాద్**
***ఫోన్: 97012 277207   adepulaxmipathi@gmail.com***